




మన భానుపురి

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం









# తెలంగాణ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల వ్యవధిలోనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాం








**-ఇప్పటివరకు 11 వేల కోట్ల వరకు ఉచిత బస్ ప్రయాణాలు జరిగాయి**

**-ప్రతి గ్రామానికి RTC బస్సులు నడపాలనేది ప్రభుత్వ లక్ష్యం**

**-రాష్ట్ర రోడ్డు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

భానుపురి/హుజూర్ నగర్

తెలంగాణ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన48 గంటల వ్యవధిలోనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించామని రాష్ట రోడ్డు రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హుజుర్నగర్ లో 3.52కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మిస్తున్న బస్సు స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర ఆహార పౌరసరఫరాలు నీటి పారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 3.52 కోట్ల రూపాయలతో బస్సు స్టేషన్ నిర్మాణం చేసుకోవడం చాలా సంతోషంగా ఉన్నదని, తెలంగాణ వ్యాప్తంగా 10,173 ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రజలను గమ్యస్థానాలకు చేర్చడం జరుగుతుందని, 35 లక్షల మహిళలు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం చేస్తున్నారని ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అందించడం ద్వారా ఇప్పటివరకు 326 కోట్ల ప్రయాణాలు పూర్త య్యాయని, మహిళలకు 11,400 కోట్ల రూపాయల మేర ప్రయోజనం చేకూర్చామని అన్నారు. మహిళా సంఘాలకు 600 బస్సులను అందించి ఆర్టీసీని బలోపేతం చేస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వ రులుగా చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తదుపరి ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి పేదవాడి కడుపు నింపేందుకు సన్న బియ్యంతో పాటు, మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. హుజూర్‌నగర్ లో బస్టాండ్ నిర్మాణంతో ప్రయాణాలు మరింత సులభతరం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు,మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్, ఆర్డీవో శ్రీనివాసులు, తాసిల్దార్ కవిత పట్టణ ప్రజలు తదితరులు అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణను ఎండబెట్టి ఆంధ్రకు నీళ్లిస్తున్నావ్




భానుపురి/సూర్యాపేట టౌన్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిగ్గు తెచ్చుకోవాలి. తెలంగాణ రైతాంగాన్ని ఎండబెట్టి ఆంధ్రకు నీళ్లు ఇస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు కాదు కదా, 17 స్థానాలు కూడా గెలవలేరని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులను సీఎం రేవంత్ రెడ్డి విమర్శించడం పట్ల శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఘాటుగా స్పందించారు. ఏదైనా సభ జరిగితే తాము చేసింది, చేయాల్సింది, ఇచ్చిన హామీలు అమలు చేసినవి, చేయాల్సినవి చెప్పాలని, తప్ప సీఎం స్థాయిని మరచి బజారు వ్యక్తిలా మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. అసలు కానేకాని డీలిమిటేషన్ లో 185 స్థానాలు అవుతాయని, అందులో తామే 119 గెలుస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. "నీ దొంగ తెలివితేటలు ప్రజలకు అర్థమయ్యాయి. ఓడిపోతామనే భయంతో నువ్వు పడుతున్న ఫ్రస్టేషన్ ను ప్రజలు గమనిస్తున్నారు. ఇప్పుడు ఎన్నికలు పెడితే కేసీఆర్ కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు" అని అన్నారు. కన్నెపల్లి పంప్ హౌస్ ను ఆన్ చేసి రైతులకు నీళ్లు ఇవ్వకుండా ఆంధ్రకు 100 టీఎంసీల నీళ్లు మళ్లించారని ఆరోపించారు. కన్నెపల్లి నుంచి 2-3 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసి గండమల్ల వరకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా, కేసీఆర్ కు పేరు వస్తుందనే మొండివైఖరితో పంప్ హౌస్ ను ఆన్ చేయడం లేదన్నారు. మేడిగడ్డకు నీళ్లు వస్తే రామాలయంతో పాటు లక్ష ఎకరాలు మునిగిపోతుందని చెప్పడం తగదన్నారు. ఇప్పటికే ఆంధ్ర వాళ్లు 27 క్యూసెక్కుల నీటిని పోలవరానికి మళ్లించి, ప్రకాశం బ్యారేజీ నింపి కాలువల్లో నీళ్లు తీసుకెళుంటే కళ్లు మూసుకున్నారని విమర్శించారు. హైదరాబాద్ లో ఫ్యూచర్ సిటీ పేరుతో తాను, తన మంత్రులు భూముల దోపిడీ చేసి రాహుల్ గాంధీకి పంపుతున్నారని, తప్ప ప్రజల కోసం చేసింది ఏమీ లేదన్నారు. బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డికి దేవుళ్ల మీద ఒట్టు వేయడం పరిపాటిగా మారిందని, భద్రాచలం రాములోరి మీద కూడా గతంలో ఒట్టు వేశారని అన్నారు. తెలంగాణలో 117 కాదు, 17 కూడా గెలవరని అన్నారు. మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయని అసమర్థ సీఎం రేవంత్ రెడ్డి అని, రిటైర్డ్ ఇంజనీర్లు కన్నెపల్లి పంప్ హౌస్ ఆన్ చేయొచ్చని చెప్పినా నీళ్లు ఇవ్వడం లేదన్నారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాండ్ల అన్నపూర్ణ మాట్లాడుతూ, దేవుడి లాంటి కేసీఆర్ ను వదిలేసి రేవంత్ రెడ్డిని గెలిపించామా అని ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో ప్రజలు స్వర్ణయుగాన్ని చూశారని, రేవంత్3ఏళ్ల పాలనలో ప్రజలు గోస పడుతున్నారని అన్నారు. మాజీ జెడ్పీటీసీ జీడి. బిక్షం మాట్లాడుతూ, ఖమ్మంలో జరిగిన రేవంత్ రెడ్డి సభ "పిచ్చోడితో తిరునాళ్లకు పోయినట్టు" ఉందన్నారు. ఓటుకు నోటు కేసు నుంచి తప్పించుకునేందుకు చంద్రబాబుతో పొత్తు పెట్టుకుని ఆంధ్రకు నీళ్లు ఇస్తూ తెలంగాణను ఎండబెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీరిచ్చి తెలంగాణ రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో కొడంగల్ లో కూడా గెలవలేరని హెచ్చరించారు. మా నాయకులను మరోసారి నోటికొచ్చినట్టు మాట్లాడితే తెలంగాణలో ప్రతి పర్యటనను అడ్డుకుంటామని, ప్రజాక్షేత్రంలో దోషిగా నిలబెట్టి తరుముతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు బండారు రాజా, శివ తదితరులు పాల్గొన్నారు.






# అరుణోదయ నాగన్న పాట ఈ సమాజ మార్పుకు దోహదపడింది

**-ఎఐకెఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి.కోటేశ్వరరావు.**



భానుపురి/సూర్యాపేట టౌన్

ప్రజా గాయకుడు,విప్లవ సాంస్కృతిక సేనాని,సీపీఐ (ఎం.ఎల్ )న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ అరుణోదయ నాగన్న సంతాప సభ ను శనివారం చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రం నందు అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచనపల్లి సైదులు అధ్యక్షత వహించారు.అయిన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎఐకెఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి.కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ, కామ్రేడ్ నాగన్న ప్రజా గాయకుడిగా విప్లవ సాంస్కృతిక యోధుడిగా గత 50 ఏళ్లుగా తన గానాన్ని కంచు కంఠముగా మోగిస్తూ ప్రజలను చైతన్యపరిచాడని అన్నారు.కామ్రేడ్ నాగన్న 70 ఏళ్ల క్రితం పోరాటాల గుమ్మం ఖమ్మం జిల్లా,తిరుమలాయపాలెం మండలం, రాజారం గ్రామంలో పేద కుటుంబం లో జన్మించి, చిన్ననాటి నుండి పుట్టడే కష్టాలు చవి చూశాడని అన్నారు.పిల్లగాడుగా పశువులు కాశాడు,జీతగాడిగా పొలం దున్నాడు,కులవృత్తిగా తాటి చెట్టుఎక్కి కళ్ళు గీసేవాడు. బతుకుతెరువు కోసం బట్టలు కుట్టే దర్జాగాను మారాడు. రెండంటే రెండే తరగతులను బడిలో చదివి నాగన్న చిన్ననాటి నుండే పాటంటే ఎంతో ఇష్టంగా యక్షగానాలు,జానపదాలు శ్రద్ధగా వినేవాడన్నారు. దేశమంతట క్రూర ఎమర్జెన్సీ పరిపాలన సాగుతున్న కాలమది,అప్పటికి తన స్వగ్రామమైన రాజారంలో ఎక్కువ కార్యక్రమాలు సాగుతున్నాయి,కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి,పొట్ల రామ నరసయ్య,లాంటి విప్లవ పార్టీ అగ్ర నాయకులు ఆ గ్రామనికి వచ్చి పోయేవారు.ఆ గ్రామానికి చెందిన పిడిఎస్ యు నాయకుడు కామ్రేడ్ శ్రీపాద శ్రీహరిని ఆ కాలంలోనే నరహంతక వెంగళరావు ప్రభుత్వం కాల్చి చంపి ఎన్కౌంటర్ గా చిత్రీకరించిందన్నారు. దీనిని సహించలేదు నాగన్న వర్గ కసిని పెంచుకున్నాడు. నాగన్న ఏనాడు కూడా తన పేరు కోసమో,కీర్తి కోసం పాట పాడలేదు.నాగన్న తన గొంతు ద్వారా తెలుగు నేలపైనే కాకుండా దేశంలోని తమిళనాడు,పశ్చిమ బెంగాల్,పంజాబ్, మహారాష్ట్ర,గుజరాత్,ఢిల్లీ, తదితర రాష్ట్రాల్లో కళా రంగ ప్రదర్శనలు చేశాడు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో కూడా బ్రహ్మాండమైన కళా ప్రదర్శనలు ఇచ్చాడు.సారా వ్యతిరేక ఉద్యమం,విద్యుత్ ఛార్జీల పెంపు వ్యతిరేక ఉద్యమం,గిట్టుబాటు ధర కోసం రైతాంగం సాగిస్తున్న ఉద్యమ సందర్భంగా నాగన్న ఎన్నో పాటలు పాడాడు.కల కల కోసం కాదు కల ప్రజల కోసం అనే నికార్సైన ప్రజా గాయకుడు కామ్రేడ్ నాగన్న లేని లోటును పూడ్చలేనిదని ఆయన ఆశయాల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.



# రూ.3 లక్షలతో పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణం

భానుపురి /సూర్యాపేట టౌన్

సమాజ సేవలో భాగంగా శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుడకుడ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు మరుగుదొడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఎన్నారై ఉప్పల కిరణ్, షీలా వీరేంద్ర సిన్హా తమ సొంత నిధులతో రూ.3 లక్షల వ్యయంతో పాఠశాలలో ఆధునిక టాయిలెట్లను నిర్మించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రమణ మాట్లాడుతూ, విద్యార్థుల అవసరాన్ని గుర్తించి ఎలాంటి ప్రచార ఆర్భాటం లేకుండా తమ సొంత నిధులతో టాయిలెట్ల నిర్మాణం చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఈ సహాయం వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగం చేకూరుతుందని, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల తరపున ఉప్పల కిరణ్, షీలా వీరేంద్ర సిన్హా లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

# దేవాలయానికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించిన పటేల్ రమేష్ రెడ్డి

భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి తన నివాసంలో పెన్‌పహాడ్ మండలం మేఘ్యా తండా గ్రామ పంచాయతీ లో గంగలి తండా లో నిర్మాణంలో ఉన్న శ్రీ శ్రీశ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయానికి రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని, దేవాలయాలు సమాజంలో ఐక్యత, భక్తి భావాలను పెంపొందించే కేంద్రాలని అన్నారు. గ్రామ ప్రజల సహకారంతో దేవాలయ నిర్మాణం త్వరగా పూర్తై భక్తులకు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి అవసరాలు, సమస్యల పరిష్కారానికి తన వంతు బాధ్యతతో కృషి చేస్తానని తెలిపారు. సమాజ సేవతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కూడా నిరంతరం సహకారం అందిస్తానని పేర్కొన్నారు.



అనంతరం మేఘ్యా తండా సర్పంచ్ భూక్య రాజు నాయక్ మాట్లాడుతూ, మార్చి 25న దేవాలయ భూమిపూజ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ఈరోజు రూ. 50 వేల ఆర్థిక సహాయం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దేవాలయ నిర్మాణానికి ఆయన అందించిన సహకారానికి గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పటేల్ రమేష్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## సూర్యాపేట రూరల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



భానుపురి /సూర్యాపేట రూరల్

సూర్యాపేట రూరల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా చౌగాని నరేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నాగార్జున రామాచారి, ఉపాధ్యక్షులుగా కుమ్మరికుంట్ల నాగరాజు కోశాధికారిగా చింత సతీష్, గౌరవ అధ్యక్షులుగా రాపర్తి మహేష్ కుమార్, గౌరవ సలహాదారులుగా చౌడొజు సాంబాచారి, నిద్ర శ్రావణ్ కార్యవర్గ సభ్యులు మానక సైదులు, మల్లేష్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు నరేందర్ రామాచారిలు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టులందరితో సమన్వయంగా పని చేస్తూ ఐక్యతతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీకీ పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

## పట్టణ ఆర్యవైశ్య మహాసభ ప్రమాణ స్వీకార మహోత్సవం ను విజయవంతం చేయండి



భానుపురి/సూర్యాపేట టౌన్

ఈనెల 19 ఆదివారం సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం మహోత్సవాన్ని పురస్కరించుకొని జమ్మిగడ్డలోని శ్రీ దత్త సాయి మందిరంలో నూతన మహిళా కమిటీ సభ్యులకు నియామక పత్రాలను జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావుతోకలిసి పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షురాలు మిట్టపల్లి శ్రీదేవి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 19 లో జరిగే నూతన కమిటీ ప్రమాణ స్వీకారాన్ని విజయవంత చేయాలి అన్నారు. పట్టణ ఆర్యవైశ్య మహాసభ తోపాటు యువజన సంఘం, మహిళా సంఘం సంయుక్తంగా మహాసభ ద్వారా పేద ఆర్యవైశ్యులకు సేవలందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బండారు రాజా,జిల్లా కోశాధికారి చల్ల లక్ష్మీకాంత్ సూర్యాపేట పట్టణ అధ్యక్షులు బెలిదే శ్రీనివాసులు సెక్రటరీ బిక్కుమల్ల కృష్ణ, కోశాధికారి ఉప్పల శ్రవణ్ కుమార్, మాజీ అధ్యక్షులు మంచాల రంగయ్య పొలిటికల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, గౌరవ సలహాదారులు మిట్టపల్లి రమేష్, గౌరవ అధ్యక్షురాలు బ్రాహ్మణపల్లి తరంగిణి, వర్కింగ్ ప్రెసిడెంట్ బెలిదే రాధ, సెక్రటరీ లకుమారపు పద్మజ, కోశాధికారి ఓరుగంటి లావణ్య, రాష్ట్ర మహిళ నాయకులు దేవరశెట్టి ఉమారాణి, తేల్లాకుల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక బద్ధ వ్యతిరేకి నరేంద్ర మోడీ

భానుపురి /సూర్యాపేట టౌన్

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సూర్యాపేట నియోజకవర్గ ఏఐటియుసి 11వ మహాసభ ధర్మ బిక్షం భవన్ ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగింది ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ నిరంతరం కార్మికుల యొక్క హక్కులను కాలరాస్తున్న కార్మిక బద్ధ శత్రువు నరేంద్ర మోడీ అని స్వతంత్రానికి పూర్వం సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను నేటి దగుల్ బాజీ ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి గుత్తా పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కార్మిక వ్యతిరేకి నరేంద్ర మోడీని సాగనంపాలని మరో స్వతంత్ర పోరాటానికి కార్మికుల సనద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు రాష్ట్రంలో దివాలా కోరి ప్రభుత్వం మాటల గారడితో మాయ చేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దొందు దొందుగానే మిగిలాయని ఆయన ఘాటుగా విమర్శించారు ఎన్నికల్లో




ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రాజకీయ పబ్బం గడుపుతూ కార్మికులను పేద ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన అన్నారు ఈ మహాసభకు ముందు ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు ఈ మహాసభకు అధ్యక్ష వర్గంగా దంతాల రాంబాబు శ్యామల అశోక్ వ్యవహరించారు.

## ఘనంగా మోత్కుపల్లి నర్సింహులు జన్మదిన వేడుకలు

భానుపురి /సూర్యాపేట టౌన్

మాజీ మంత్రి, మాదిగ మహాశక్తి వ్యవస్థాపకుడు మోత్కుపల్లి నర్సింహులు జన్మదిన వేడుకలను శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు. జన్మదినాన్ని పురస్కరించుకుని మోదీన్‌పురం గ్రామానికి చెందిన, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ ముస్లిం సోదరుడికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాన్ని సీడ్స్ ఫౌండేషన్ చైర్మన్ డా.సగరపు ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డా.సగరపు ప్రసాద్ మాట్లాడుతూ మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజా జీవితంలో కొనసాగుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేశారని కొనియాడారు. ముఖ్యంగా దళితుల హక్కుల కోసం శాసనసభలోనూ, ప్రజా వేదికలపైనా గళమెత్తిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తెలంగాణలో మాదిగ




సామాజిక వర్గానికి రాజకీయ ప్రాధాన్యం కల్పించాలనే లక్ష్యంతో ‘మాదిగ మహాశక్తి’ సంస్థను స్థాపించి సామాజిక చైతన్య కార్యక్రమాలు



నిర్వహిస్తున్న మోత్కుపల్లి నర్సింహులకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ప్రజాసేవ మరింత కాలం కొనసాగాలని ఆకాంక్షించారు.

## ఆర్యవైశ్య మహాసభ జీవిత సభ్యత్వాలను స్వీకరించిన మహిళలు



భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సోమ ప్రవీణ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ జీవిత సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎం. చంద్రకళ, రేపాల శ్రీదేవి, ఎం. స్వాతి జీవిత సభ్యత్వ రుసుము చెల్లించి రసీదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు దోగుపర్తి ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమ ప్రవీణ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ జీవిత సభ్యత్వ నమోదు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతోందని, ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున ఉత్సాహంగా సభ్యత్వాలు తీసుకోవడం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు. సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షురాలు మిట్టపల్లి శ్రీదేవి ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో జీవిత సభ్యత్వాలు నమోదు చేసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. జీవిత సభ్యత్వం స్వీకరించిన ఎం. చంద్రకళ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ జీవిత సభ్యత్వం పొందడం తమకు ఎంతో ఆనందంగా, గౌరవంగా ఉందని పేర్కొన్నారు.

## ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పట్టా సాధించిన డా.పెరుమండ్ల వినయ్ కుమార్

భానుపురి /నల్లగొండ:

ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) విద్యుత్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డా. పెరుమండ్ల వినయ్ కుమార్ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టాను విజయవంతంగా సాధించారు. ఆయన నల్గొండ జిల్లా దీపకుంట గ్రామానికి చెందిన పెరుమండ్ల రాములు, సావిత్రమ్మ దంపతుల పెద్ద కుమారుడు. ”ఎన్హాన్స్ మల్టీ- ఫంక్షనల్ ఈవి చార్జర్ పెర్ఫార్మన్స్ విత్ బి - డైరెక్షనల్ ఎస్ఈపీఐసీ కన్వెర్టర్ అండ్ ఏఎన్ఎఫ్ఐఎస్ కంట్రోల్ ఫర్ గ్రిడ్-కనెక్టెడ్ పీవీ సిస్టం” అనే అంశంపై ప్రొఫెసర్ పి.వి.ప్రసాద్ ప్రధాన పర్యవేక్షణలో,ప్రొఫెసర్ ఈ.విద్యాసాగర్ సహ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా డా.వినయ్ కుమార్ మాట్లాడుతూ,తన తల్లిదండ్రుల త్యాగం, గురువుల మార్గదర్శకత్వం, సతీమణి శైలజ సహకారం, కుమార్తెలు జైత్విక,చరిష్మ, తమ్ముళ్లు విజయ్ కుమార్, చెంతన్ బాబు అందించిన ప్రోత్సాహమే తన విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ విద్యా సందేశం, ఆశయాలు తనకు నిరంతర స్ఫూర్తిగా నిలిచాయని పేర్కొంటూ, ఈ




విజయాన్ని తల్లిదండ్రులు, గురువులు,కుటుంబ సభ్యులకు అంకితం చేస్తున్నట్లు వెల్లడించారు. డా.వినయ్ కుమార్ పీహెచ్‌డీ సాధించడం పట్ల ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకులు, దీపకుంట గ్రామ ప్రజలు, డా.బి.ఆర్.అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ, బీటీఎస్ నల్గొండ సభ్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో విద్యా, పరిశోధన రంగాల్లో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.